క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మురళీనగర్: జోన్ – 2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్‌లో ఏఎల్ 59 జీబ్రా కండక్టర్స్ మార్పిడి పనులు కారణంగా సోమవారం నుంచి ఈ నెల 7వ తేదీ గురువారం వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రామ్‌జీ ఎస్టేట్, బాపూజీనగర్, కప్పరాడ, జయప్రకాష్‌నగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్యకాలనీ, సురేష్‌రామ్‌నగర్, జగజ్జీవన్ నగర్‌లో రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

15 కేజీల గంజాయి పట్టివేత

మద్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కారు. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ నుంచి గోవర్ధన్ సగారియా (19), గౌరబ్ హరిజన్ (25), అభిషేక్ బాగ్(25) బ్యాగుల్లో గంజాయి తీసుకొస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారిని జ్ఞానాపురం రైల్వే స్టేషన్ దరి ఎర్నిమాంబ ఆలయం వద్ద పట్టుకుని ఐదో పట్టణ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎస్.సాయి ముగ్గురినీ అరెస్ట్ చేసి 15 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



విశాఖ రైల్వేస్టేషన్లో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వేస్టేషన్ పరిధి న్యూకోచింగ్ కాంప్లెక్స్ క్లీనింగ్ యార్డ్‌కు చెన్నై నుంచి విశాఖపట్నం వచ్చిన 22810 రైలు జనరల్ కంపార్ట్‌మెంట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గుర్తించారు. మృతునికి సుమారు 50 సంవత్సరాలు వయసు వుంటుందని భావిస్తున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల జీఆర్పీ సిబ్బందిని స్వయంగా, లేదా 96033 92825, 78935 72974, 94406 27547లో సంప్రదించాలని కోరారు.

తుపాను హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తం



నిర్మానుష్యంగా ఉన్న సీతమ్మధార ప్రధాన రహదారి

సీతమ్మధార: మిచాంగ్ తుపాను హెచ్చరికలతో నగర ప్రజలు అప్రమత్తమయ్యారు. కూరగాయలు, కిరాణాసామగ్రి వంటి నిత్యావసర వస్తువులను ఉదయమే కొనుగోలు చేసుకున్నారు. సీతమ్మధార రైతుబజారులో ఉదయం 10 గంటలకే కూరగాయలు అయిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచే ఈదురుగాలులు వీయడంతో ప్రజలు చాలావరకు ఇంటికే పరిమితమయ్యారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో నగర ప్రజలు అర్జీలు పెట్టుకోవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

నాడు

మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని ఆపసోపాలు పడుతూ విద్యాభ్యాసం కొనసాగించేవారు. రంగులు వెలిసిన గోడలు.. శిథిలమైన భవనాలు.. తాగునీటికి అవస్థలు.. మరుగు సౌకర్యం అంతంత మాత్రం.. దీంతో పాఠశాలకు రావాలంటే ఏ మాత్రం ఇష్టపడేవారు కాదు.

నేడు

పాఠశాల డిజిటల్ సొబగులు అద్దుకుంది. విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలు వచ్చాయి. బ్లాక్‌బోర్డు కూడా సరిగ్గా లేని చోట డిజిటల్ బోర్డులు ఏర్పాటయ్యాయి. ప్రతీ తరగతిలో ఒక స్మార్ట్ టీవీ దర్శనమిస్తోంది. క్రోమ్ బుక్స్ చేతికి అందాయి. ఇంగ్లిష్ ల్యాబ్, ఆర్వో ప్లాంట్, పెయింటింగ్.. ఇలా అన్ని వసతులు కల్పించడంతో పాటు అత్యాధునిక విధానంలో బోధనతో పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు.

టోఫెల్ పరీక్షల్లో నిమగ్నమైన విద్యార్థులు



చిన్నారుల చదువుల్లో డిజిటల్ వెలుగులు

డిజిటల్ పరికరాలు రూ. 27లక్షలు
డ్యూయల్ డెస్క్ బెంచీలు రూ.1.77లక్షలు
7స్మార్ట్ టీవీలు రూ.4.50లక్షలు
40 క్రోమ్ బుక్స్ రూ.16లక్షలు
8డిజిటల్ బోర్డులు రూ.4లక్షలు
లెర్నింగ్ కార్నర్స్, పెయింటింగ్స్ రూ.4.02లక్షలు
కే యాన్స్ డిజిటల్ ప్రొజెక్టర్లు రూ.2 లక్షలు

మురళీనగర్: భావిభారత నిర్మాణం జరిగేది తరగతి గదుల్లోనే అని బలంగా నమ్మిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించడంతోపాటు సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకునేలా డిజిటల్ పరికరాలను అందించారు. దీంతో చిన్నారులు ఆడియో విజువల్ పరికరాల ద్వారా విజ్ఞానాన్ని సముపార్జిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడమే కాకుండా ఇంగ్లిష్‌లో నిష్ణాతులను చేసే దిశగా వినూత్న విధానాలను అమలు చేస్తున్నారు.



స్మార్ట్ టీవీలతో టెక్నాలజీ పరిచయం

పాఠశాలలకు స్మార్ట్ టీవీలు సరఫరా చేయడం ద్వారా విద్యార్థులకు టెక్నాలజీని పరిచయం చేశారు. మొత్తం పరికరాల కోసం రూ. 25లక్షలు ఖర్చు చేశారు. ఈ పాఠశాలలో రూ.4.50లక్షల విలువైన 7స్మార్ట్ టీవీలను అందించారు. ప్రతీ తరగతి గదిలో ఒక స్మార్ట్ టీవీ ఉండేలా ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలను ప్రసారం చేస్తారు. విద్యార్థులకు వీటిని వీక్షించి చివరిలో అడిగిన ప్రశ్నలకు జవాబులు రాస్తారు. రూ.2 లక్షలతో 2 కే–యాన్స్ ప్రాజెక్టర్లు అందించారు. వీటిలో పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రాజెక్టు వర్కులు ఉంటాయి. వీటిని విద్యార్థులు ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఉపాధ్యాయులకు అందించాలి. అంటే బాల్యం నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేలా ఇవి ఉపయోగపడతాయి. రూ.16లక్షలు విలువైన 40 క్రోమ్ బుక్స్ అందించారు. వీటిలో విద్యార్థుల పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియోలు, రైమ్స్ ఉంటాయి. వీటిని ల్యాప్‌ట్యాప్ మాదిరిగా వినియోగించుకోవచ్చు. డిజిటల్ బోర్డులు ఒక్కొక్కటి రూ.50వేలు ఉంటుంది. ఇలాంటివి 8 డిజిటల్ బోర్డులు ఇచ్చారు. వీటిపై సుద్దముక్కలతో పని లేకుండా పాఠాలు చెప్పవచ్చు.



ఇది కదా అభివృద్ధి



స్మార్ట్ టీవీపై టోఫెల్ పాఠాలు

టోఫెల్ శిక్షణ

ఈ ఏడాది నుంచి పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల భాషా ప్రావీణ్యం కోసం టోఫెల్‌పై శిక్షణనిస్తున్నారు. 3,4,5తరగతులకు చెందిన 200మంది విద్యార్థులు ఫారిన్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ భాషా ఉచ్ఛరణపై పూర్తి స్థాయి శిక్షణ తీసుకుంటున్నారు. డిజిటల్ బోర్డుపై ఆడియోలు వీడియోలు ప్రదర్శించి విద్యార్థులు ఆంగ్ల భాషా శిక్షణ ఇస్తున్నారు. వీరికి ఇటీవల టోఫెల్ పరీక్షలు కూడా నిర్వహించారు.

వసతులు

పాఠశాలలో రూ.40వేలతో ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సురక్షిత మంచినీటిని అందించేందుకు రూ.4.63లక్షలతో ఆర్వో ప్లాంటు సమకూర్చారు.



తరగతి గదిలో డిజిటల్ బోర్డు, స్మార్ట్ టీవీ

తరగతి గోడలను లెర్నింగ్ కార్నర్స్‌గా మార్చారు. ఎక్కడ ఏ గోడ చూసినా విద్యాభ్యాసానికి ఉపయోగపడే చిత్రాలు, ఇంగ్లిష్, తెలుగులో రంగురంగులతో తీర్చిదిద్దారు. పాఠశాలలో పెయింటింగ్ పనుల కోసం రూ.4.02లక్షలు ఖర్చు చేశారు. పాఠశాలకు వెళ్లగానే విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో డిజిటల్ విద్యను అభ్యసిస్తున్నారు.

అనూహ్యమైన మార్పు



మా పిల్లలిద్దరూ ఇక్కడే చదువుతున్నారు. బాబు 1వ తరగతి, పాప 3వ తరగతి. పాఠశాలలో గతంలో ఏ సౌకర్యాలు ఉండేవి కాదు. మంచినీరు ఉండేది కాదు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందేవి కాదు. ఇప్పుడు పాఠశాల ప్రారంభం రోజునే అన్ని పుస్తకాలు, యూనిఫారాలు అందిస్తున్నారు. చదువులో మార్పులు వచ్చాయి. బట్టీ పద్ధతి నుంచి సృజనాత్మకంగా ఆలోచించే విధంగా బోధన జరుగుతోంది. థ్యాంక్యూ సీఎం సార్.

– పి.సునీత, పేరెంట్, మురళీనగర్

కార్పొరేట్ స్థాయిలో ..



మా ఇద్దరు అమ్మాయిలు ఇక్కడే 4వ తరగతి, 2వ తరగతి చదువుతున్నారు. ఇప్పుడు పాఠశాలను చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది. కార్పొరేట్ పాఠశాలకన్నా బాగా తీర్చిదిద్దారు. ప్రాంగణాన్ని టైల్స్‌తో నిర్మించడమే కాకుండా పరిసరాలన్నీ పచ్చదనంతో నింపారు. మా పిల్లలు బాల్యం నుంచే టెక్నాలజీ నేర్చుకుంటున్నారు. దీనివల్ల ఉన్నత తరగతులు వెళ్లేసరికి మంచి స్టాండర్డ్ ఉంటుంది.

– సీహెచ్.కుమారి, వుడా కాలనీ

ఇంగ్లిష్‌లో బాగా మాట్లాడుతున్నారు



మా పెద్ద పాప 3వ తరగతి, చిన్న పాప 1వ తరగతి చదువుతున్నారు. వాళ్లు టోఫెల్ శిక్షణ ద్వారా మంచి ఇంగ్లిష్ మాట్లాడుతున్నారు. వాళ్ల ఇంగ్లిష్ ఉచ్చారణలో మార్పు చూసి మేము ఆశ్చర్యపోతున్నాం. డిగ్రీ తర్వాత విదేశాలకు వెళ్లాలనుకునే వారు టోఫెల్ పరీక్షలు రాస్తారు. అలా కాకుండా మా పిల్లలు ప్రాథమిక, ఉన్నత తరగతుల స్థాయిలోనే టోఫెల్ సర్టిఫికెట్లు పొందే అవకాశం కలిగింది.

– జి.రామారావు, సాయిరామ్‌నగర్

పకడ్బందీగా డిజిటల్ విద్య అమలు



పాఠశాలలో డిజిటల్ విద్యను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఆడియో వీడియో పాఠాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నాం. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటున్నారు. పర్యవేక్షణకు సెంట్రలైజ్డ్ మైక్‌సిస్టమ్ ఏర్పాటు చేశారు. దీని వల్ల పర్యవేక్షణ సులువుగా ఉంది. అందరికీ ఒకేసారి సూచనలు ఇవ్వడానికి అవకాశం ఉంది. డిజిటల్ పరికరాల ద్వారా బోధనాభ్యసన ప్రక్రియ జరగడం వల్ల పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తున్నారు.

– శిరిపురపు పెద్దినాయుడు, ప్రధానోపాధ్యాయుడు

అలరించిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకులు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, యం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్ రాజు, రాణి, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, గోపీ నాయుడు, నేహ, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ నవ్వులు పూయించాయి. ముందుగా దుర్గాప్రసాద్ చేసిన కామెడీ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, శివప్రసాద్, నందూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, బాందంగీర్ సాయి, సన్‌మూర్తి పాల్గొని కళాకారులను సత్కరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్లకు సీఐ విజయ్‌కుమార్ ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. ఈ మేరకు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. వారి వేలిముద్రలు సేకరించారు. అల్లర్లు చేయకుండా, తగాదాల్లో తలదూర్చకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. మరలా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఉంటుందని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

- ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్టేషన్‌లో ఎస్‌ఐ ధర్మేంద్ర ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు. తగాదాల్లో తల దూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలలను ఆకట్టుకున్న కథలు



ఆసక్తిగా కథలు వింటున్న చిన్నారులు

సీతంపేట: స్థానిక పౌరగ్రంథాలయంలో మియావాకీ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం ఉదయం స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం జరిగింది. ముంబైకి చెందిన బాలల రచయిత్రి కేటీ బాగ్లీ వర్చువల్ విధానంలో ఆసక్తికర కథనంతో పిల్లలను ఆకట్టుకున్నారు. 8 నుంచి 13 ఏళ్ల వయసు పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సెషన్‌లో ఆమె కథలకు జీవం పోశారు. ఈ సెషన్‌లో రెండు కథల పుస్తకాలను ప్రదర్శించారు. కథల ద్వారా వినోదంతో పాటు పర్యావరణంపై అవగాహన కల్పించారు. పౌరగ్రంథాలయం, భారతీయ విద్యాభవన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

17న దివంగత నటుడు శోభన్‌బాబు విగ్రహావిష్కరణ



ఆహ్వానపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : అందాల కథానాయకుడు శోభన్‌బాబు కాంస్య విగ్రహం ఈ నెల 17న ఆవిష్కరించనున్నట్టు విగ్రహ నిర్మాణ కమిటీ నిర్వాహకులు, శోభన్‌బాబు పర్సనల్ మేనేజర్ ఎస్ఎన్ రావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోగ్గాడిగా అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రముఖ సినీ హీరో శోభన్‌బాబును స్మరించుకుంటూ నగరంలోని డాబాగార్డెన్స్ జంక్షన్‌లో ఈ నెల 17న కాంస్య విగ్రహం ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి తదితరుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. శోభన్‌బాబు అభిమానులు, కమిటీ సభ్యులు కె. కనకరాజు, దసపల్లా హోటల్ మేనేజర్ బెహరా ప్రసాద్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, గువ్వల రమణ, జె. త్రిమూర్తులు, కె. శోభన్‌బాబు, ఆడిన నాగరాజు, బి. కుమార్, ఓవీ రమణ పాల్గొన్నారు.

కాలేజీల్లో అప్రమత్తంగా ఉండాలి

విశాఖ విద్య: తుపాను ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలోని జూనియర్ కాలేజీల నిర్వాహకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీవీఈఓ బి.రాధ ఒక ప్రకటనలో సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులను కూర్చోబెట్టకూడదని, లీకేజీలు ఉన్న గదుల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. నాడు–నేడు పనులు జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెటీరియల్ పాడవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చురుగ్గా ఓటర్ల నమోదు



నక్కవానిపాలెం శిబిరంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, తదితరులు

సీతమ్మధార : ఓటరు జాబితా పరిశీలన, సవరణలు, అర్హులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది ఆదివారం అందుబాటులో ఉన్నారు. ఈ నెల 2, 3న పోలింగ్ కేంద్రాల స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌కు ఎన్నికల కమిషన్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పర్యటించి ఓటరు నమోదును పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్రిపాలెం : జీవీఎంసీ 50, 51, 53వ వార్డులో ఓటరు నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ నేతృత్వంలో వార్డు కార్యాలయంలో ఓటరు నమోదు ప్రక్రియ ఆదివారం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పాల్గొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, సనపల నారాయణస్వామి, ధనుంజయ పాల్గొన్నారు. – 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, కేకే రాజు ఓటర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటరు జాబితా కోసం వచ్చిన ప్రజల సందేహాలు తీర్చారు. కార్యక్రమంలో బి.తిరుమలరావు, అంబటి శైలేష్, మెట్ట దమయంతి, పొన్నాడ అప్పారావు, వరలక్ష్మి, ధర్మావతి పాల్గొన్నారు.

53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ సూచనల మేరకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద అంబేడ్కర్ భవన్‌లో ఓటరు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. అక్కడికి వచ్చిన ఓటర్లకు సవరణ, మార్పులు, చేర్పులతో పాటు కొత్త ఓట్లు నమోదు చేశారు. పార్టీ నాయకులు షేక్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త దరఖాస్తుల స్వీకరణ

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అధ్వర్యంలో సీతంపేట జంక్షన్‌లో కొత్త ఓట్ల నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నమోదు కోసం వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అలాగే వార్డుకు సంబంధించిన వారు ఓటు ఉందో లేదో చూసుకుని సవరణకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఉప్పాడ సన్నీ, సచివాలయం కన్వీనర్లు వానపల్లి లక్ష్మణకుమార్, డి.కోటేశ్వరరావు, నంబు పద్మ, బోనుల జయ, రావాడ వీరమ్మ, సంధ్య, కనకరత్నం, బూత్ లెవెల్ ఏజెంట్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని సుందర అభయాంజనేయ స్వామి గుడి వద్ద ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ ఒక్కరూ జాబితాలో ఓట్లు చూసుకోవాలని, అవసరమైతే సవరణలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, నాయుడు, సన్ని, ఆదిలక్ష్మి, తవుడమ్మ, సువర్ణ, దుర్గేష్, బూత్ ఇన్‌చార్జిలు, కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



50వ వార్డులో ఓటరు దరఖాస్తు పరిశీలిస్తున్న కేకే రాజు



ఓటరు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న కంపా హనోకు



సీతంపేటలో ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గోవింద్

'ఒంటి కాలు పరుగు' పుస్తకావిష్కరణ



సాహితీ సభలో మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

మహారాణిపేట : తెలుగు భాష, సాహిత్యాలను పరిపుష్టం చేస్తూ రచనలు చేసిన ఘనత డాక్టర్ బండి సత్యనారాయణ సొంతమని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఆదివారం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన ఒంటి కాలు పరుగు కవిత్వ సంపుటిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ గొప్ప రచనలు చేశారన్నారు. సామాజిక స్పృహతో మానవీయ కోణంలో ఆయన రచనలు ఉంటాయన్నారు. స్త్రీవాదాన్ని సమర్థిస్తూ కవితలు రాశారని అన్నారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్తగా కవితలు రాసే వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి కార్యక్రమాల విభాగాధిపతి బేతా రామ సూర్య ప్రకాశరావు, ప్రముఖ కవి, రచయిత గరిమెళ్ల నాగేశ్వరరావు, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, మేనేజర్ పి.ఎ.రాజు, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల గీతా ప్రచార సమితి కార్యాలయంలో గీతా జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు ఆదివారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు పఠించడం వల్ల మానసిక వికాసం కలుగుతుందన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ద్వారా అందించిన సందేశాన్ని ఆచరించి జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలన్నారు. పోటీలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు పి. జగన్మోహనరావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, జీవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.